www.netifocusnews.com

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

శుక్రవారం 21, నవంబర్ 2025 | వెల: రూ.4/- | సంపుటి: 01 | సంచిక: 40 | పేజీలు: 04

Published From: Hyderabad | Editor: Mankali Tharun



# రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు తగదు

- బిల్లులపై గవర్నర్లు సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చు
- మంత్రి మండలి సలహా పాటించడం తప్పనిసరి కాదు
- గవర్నర్లు నిరవధికంగా బిల్లులను తొక్కి పెట్టడం కుదరదు
- అయితే అసెంబ్లీకి పంపాలి... లేదంటే ఢిల్లీకి పంపాలి
- గడువు మీరితే బిల్లు పాసైనట్లే అనడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదు
- కారణం లేకుండా పెండింగ్‌లో పెడితే కోర్టులు కలుగజేసుకోవచ్చు
- రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలపై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేవనెత్తిన 14 ప్రశ్నలకు సమాధానాలు

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 20:

రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. అటువంటి సమయంలో సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను న్యాయస్థానం ఆదేశించవచ్చని చెప్పింది. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించి పంపించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలిపే అంశానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక నిర్ణయాన్ని వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143వ నిబంధన కింద 14 ప్రశ్నలతో న్యాయ సలహా(ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) కోరిన నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. 111 పేజీలతో 11 ప్రశ్నలకు సమాధానం ఇస్తూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తమిళనాడుకు చెందిన పది బిల్లులను గవర్నర్ తొక్కిపట్టినప్పటికీ మిగతా 2లో..




## ఫార్ములా-ఈ కారు రేసు కేసులో
# కీలక పరిణామం

- ఏసీబీకి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పచ్చజెండా
- చార్జిషీటు దాఖలుకు ఏసీబీ సన్నాహాలు
- ఇదంతా కాంగ్రెస్, బీజేపీ కుట్ర: బీఆర్ఎస్
- కాంగ్రెస్ సర్కారు కక్ష సాధింపులకు పోదు
- చట్టప్రకారమే విచారణ: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

## కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతి

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 20:


ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ1గా ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్‌ను విచారించేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం అనుమతి ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఇప్పటికే పలుమార్లు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఈ క్రమంలో కేటీఆర్, ఇతర నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయడానికి ఏసీబీ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. నాడు మంత్రి హోదాలో నిర్ణయాలు తీసుకున్న కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతించాలంటూ ఏసీబీ నుంచి వచ్చిన వినతిని సెప్టెంబరు 9న రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపింది. దీనిపై న్యాయనిపుణుల సలహాలు తీసుకున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. తాజాగా ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చారు. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర మిగతా 2లో..

## పల్లె పోరుకు
# వడివడిగా అడుగులు..

- రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ నివేదికకు ఆమోదం
- అనంతరం జిల్లాల్లో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల ఖరారు
- పంచాయతీ ఎన్నికలకు 26న షెడ్యూల్? నోటిఫికేషన్ జారీ
- ఎన్నికల ప్రక్రియపై ఎస్ఈసీ, సీఎస్, డీజీపీ వీడియో కాన్ఫరెన్సు

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 20:

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ అలా నివేదిక సమర్పించగానే.. ఇలా మంత్రులందరికీ పంపి ఆమోదం కోసం సంతకాలు కూడా తీసేసుకుంది. ఈ నెల 26న గ్రామ పంచాయతీ ఎన్నికలకు






దానం, కడియంలకు మరోసారి
# స్పీకర్ నోటీసులు

- బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై వివరణ ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 20:

బీఆర్ఎస్ పార్టీ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తక్షణమే అఫిడవిట్ రూపంలో వివరణ ఇవ్వాలంటూ ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు గురువారంనాడు స్పీకర్ ప్రసాద్‌కుమార్.. నోటీసులు మిగతా 2లో..



ప్రపంచ బాక్సింగ్ కప్ తుది పోరులో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో (51 కేజీల విభాగంలో) అద్భుత ప్రతిభను ప్రదర్శించి మరోసారి ప్రపంచ వేదికపై దేశ కీర్తిని నలుదిశలా చాటారని ప్రశంసించారు.

## తెంగాణ మాదిరిగా దేశమంతటా
# సన్నబియ్యం ఇవ్వండి

- కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్‌రెడ్డి సూచన



హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 20:

తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందని.. కేంద్ర ప్రభుత్వం కూడా దేశమంతా ఈ పథకాన్ని అమలుచేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సూచించారు. గురువారం ఉదయం హైదరాబాద్‌కు వచ్చిన ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి తాజ్ హోటల్‌లో భేటీ అయ్యారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ఇలా ప్రజలు తినేబియాన్ని పంపిణీ చేయడం వల్ల పథకం లక్ష్యం నెరవేరిందని.. పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గిందని, బహిరంగ మార్కెట్లోనూ ధరలు స్థిరపడ్డాయని చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో మిగతా 2లో..



# దానం, కడియంలకు మరోసారి స్పీకర్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసినట్లు తెలుస్తోంది. తమ పార్టీ టికెట్‌పై గెలిచిన దానం నాగేందర్, కడియం శ్రీహరి సహా పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ ప్రసాద్‌కుమార్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై వారు సుప్రీం కోర్టునూ ఆశ్రయించారు. ఆ పది మంది ఎమ్మెల్యేలపైదాఖలైన పిటిషన్లపైన విచారణ ప్రక్రియను అక్టోబరు 31 కల్లా పూర్తి చేయాలంటూ కోర్టు ఆదేశాలూ జారీ చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు విచారణ ప్రక్రియను చేపట్టిన స్పీకర్ ప్రసాద్‌కుమార్.. పది మంది ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ చేశారు. ఈ పది మంది ఎమ్మెల్యేలలో దానం నాగేందర్, కడియం శ్రీహరిలు మినహా మిగిలిన 8 మంది ఎమ్మెల్యేలూ అఫిడవిట్ల రూపంలో వివరణ ఇచ్చారు. వాటిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరాలు చెప్పడం, ఆ 8 మంది ఎమ్మెల్యేలపై విచారణ ప్రక్రియను చేపట్టడం వెంటవెంటనే జరిగాయి. విచారణ ప్రక్రియ నడుస్తున్న నేపథ్యంలో స్పీకర్ కార్యాలయం సుప్రీం కోర్టును మరికొంత గడువు కోరింది. అయితే బీఆర్ఎస్ పార్టీ మరోమారు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో నాలుగువారాల్లో విచారణ ప్రక్రియ ముగించాల్సిందిగా స్పీకర్‌కు అత్యున్నత న్యాయస్థానం సూచన చేసింది. ఈ నేపథ్యంలో.. బుధవారంనాటికి ఆరుగురు ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపైన విచారణను స్పీకర్ పూర్తి చేశారు. గురువారంనాడు పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలపై దాఖలైన పిటిషన్లపై విచారణ ముగించారు. ఈ 8 పిటిషన్లపైన స్పీకర్ తన నిర్ణయం వెలువరించాల్సి ఉంది. కాగా.. 8 మందితో పాటుగా నోటీసులు అందుకున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి.. వివరణ ఇవ్వడానికి అప్పట్లో సమయం కోరారు. విచారణ ప్రక్రియను ముగించేందుకు సుప్రీం కోర్టు నాలుగు వారాలు గడువు ఇచ్చిన నేపథ్యంలో ఆ ఇద్దరికీ స్పీకర్ మరోసారి నోటీసులు జారీచేశారు. శాసనసభలో సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యునిగా కొనసాగుతున్న దానం నాగేందర్.. గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇక,కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య.. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆమె తరఫున కడియం శ్రీహరి బాహాటంగానే తిరిగి ప్రచారం చేశారు. వీరిద్దరిలో.. దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారనడానికి స్పష్టమైన ఆధారాలు ఉన్న నేపథ్యంలో ఆయనపై అనర్హతవేటు పడేందుకు ఆస్కారం ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ స్పీకర్ మరోమారు నోటీసులు జారీ చేయడంతో.. దానం నాగేందర్ గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయన అధిష్ఠానం పెద్దలను కలవనున్నట్లు చెబుతున్నారు.

# ముగిసిన హిడ్మా దంపతుల అంత్యక్రియలు

కొత్తగూడెం, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 20:

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పీఎల్‌జీఏ చీఫ్ హిడ్మా దంపతుల అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో గురువారం నిర్వహించారు. ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఈ నెల 18న జరిగిన ఎన్‌కౌంటర్ లో వారు మృతిచెందిన విషయం విదితమే. వీరితోపాటు మరో నలుగురు కూడా మృతిచెందారు. వీరి మృతదేహాలకు ఏపీలో గురువారం పోస్టుమార్టం పూర్తయ్యింది. తన వయసు సహకరించడం లేదని హిడ్మా తల్లి మడావి పొజ్జె చేసిన అభ్యర్థన మేరకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఆంధ్రా ప్రభుత్వ సహకారంతో మృతదేహాలను స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పువర్తి గ్రామానికి తరలించారు. ఊరి పొలిమేర నుంచే 300 మంది గ్రామస్థులు హిడ్మా దంపతుల మృతదేహాలను స్వగృహానికి తరలించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు అంతిమయాత్రలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# నేతన్నల రుణమాఫీకి రూ.33కోట్లు విడుదల

## మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 20:



నేత కార్మికుల రుణమాఫీ కోసం రూ.33కోట్లు విడుదల చేసినట్టు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు తీసుకురావడంతో పాటు పునరుద్ధరించినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల నేతన్నలకు నిరంతర ఉపాధి లభిస్తుందని, అందులో భాగంగా టెస్కోకు రూ.588కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని చెప్పారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, హనుమకొండ జిల్లాల్లోని 130 ఎంఏసీఎస్, 56 ఎస్ఎస్ఐ యూనిట్ల ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకం కింద, స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరల ఉత్పత్తి జరిగిందని వివరించారు. అంతకుముందు ధర్నాచౌక్‌లో రుణమాఫీ కోసం చేనేత కార్మికులు ధర్నా చేశారు. ప్రభుత్వం దిగొచ్చి రుణమాఫీ కోసం రూ.33కోట్లు విడుదల చేసిందని నేత కార్మికులు తెలిపారు.

# రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు తగదు

(మొదటి పేజీ తరువాయి)

అవి ఆమోదం పొందినట్లు పరిగణిస్తున్నామని ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తీర్పును కేంద్ర ప్రభుత్వం సవాలు చేయకుండా మీకు ఆ అధికారాలు ఉన్నాయా చెప్పండంటూ సుప్రీంకోర్టును రాష్ట్రపతి ద్వారా న్యాయ సలహా కోరింది. దీనికి సమాధానంగా సుప్రీం... రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే చర్యలు న్యాయస్థానాల పరిశీలనకు అతీతం కాదని చెబుతూనే రాజ్యాంగ అధినేతలకు బిల్లుల ఆమోదం కోసం గడువు విధించడం సరైంది కాదని స్పష్టం చేసింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. అవి... ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియజేయడం. ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం. బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం.. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో



రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. ''బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు కానీ, ఆమోదాన్ని నిలిపివేసే సమయంలో కానీ గవర్నర్ తన సొంత విచక్షణ ప్రకారం వ్యవహరించవచ్చు. అలాంటి సమయాల్లో మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. అయితే, సుదీర్ఘకాలం వివరించలేని కారణాల వల్ల ఒక బిల్లుపై నిర్ణయం తీసుకోకపోతే సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవలసిందిగా కోర్టు గవర్నర్‌కు పరిమితమైన ఆదేశాలు జారీ చేయవచ్చు. 361 అధికరణ కింద వారికి రక్షణ కవచం ఉన్నప్పటికీ సుదీర్ఘమైన ఆలస్యం జరిగినప్పుడు హేతుబద్ధమైన సమయంలో బిల్లులను ఆమోదించేందుకు, తిరిగి పంపేందుకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చు. తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. అయితే, ఒక బిల్లుకు ఆమోదం సుదీర్ఘ కాలం తెలపకపోతే దాన్ని ఆమోదించినట్టు భావించాల్సిందేనన్న వైఖరిని రాజ్యాంగం అనుమతించదు. అలాంటి పెండింగ్ బిల్లులను ఆమోదించినట్టే భావించాలని ఆర్టికల్ 142ను అనుసరించి న్యాయస్థానం చెప్పడం కుదరదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చు'' అని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. చట్టసభల ద్వారా నియమితులైన మంత్రివర్గం డ్రైవింగ్ సీటులో కూర్చోవాలనే విషయంలో సుప్రీంకోర్టుకు భిన్నాభిప్రాయమేమీ లేదని చెప్పింది.

# ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కీలక పరిణామం



(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది వ్యవహారాల శాఖ (డీవోపీటీ) కూడా అనుమతినివ్వాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే డీవోపీటీకి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విజిలెన్స్ కమిషనర్.. అర్వింద్‌కుమార్ విచారణకు అనుమతి ఇచ్చారు. ఇక డీవోపీటీ అనుమతి కోసం ఏసీబీ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఈ కేసులో ఏ3గా ఉన్న హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన విచారణకు విజిలెన్స్ అనుమతి సరిపోతుంది. ఫార్ములా-ఈ రేసుకు సంబంధించి గతేడాది ఏసీబీ కేసు నమోదు చేసిన తర్వాత ఈడీ సైతం మనీలాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. గత ప్రభుత్వంలో పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ మంత్రివర్గం అనుమతి లేకుండా, సచివాలయ నిబంధనలకు విరుద్ధంగా డబ్బు విడుదలకు అనుమతినివ్వడంతో హెచ్ఎండీఏకు రూ. 54.88 కోట్ల నష్టం జరిగిందంటూ ఐఏఎస్ అధికారి దానకిషోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు కేటీఆర్, అర్వింద్, బీఎల్ఎన్‌రెడ్డితో పాటు గ్రీన్ కో కంపెనీ యాజమాన్యాన్ని, ఫార్ములా-ఈ రేసు సీఈవోను పలుమార్లు విచారించారు. అనేక సాక్ష్యాధారాలను సేకరించారు. కేటీఆర్ ప్రమేయంతోనే చెల్లింపులు జరిగాయని నిర్ధారించుకున్న అధికారులు.. సెల్‌ఫోన్, ట్యాబ్‌ను అప్పగించాలంటూ నోటీసులిచ్చారు. ఫోన్ ఇవ్వడానికి నిరాకరిస్తూ కేటీఆర్ ఏసీబీకి లేఖ రాశారు. కేటీఆర్ తదితరులపై ఏసీబీ అధికారులు గతే డాది డిసెంబరు 19న కేసు నమోదుచేశారు. సాక్ష్యాధారాలను సేకరించిన ఏసీబీ.. త్వరలోనే కోర్టులో చార్జిషీటు దాఖలు చేయనుంది. కేటీఆర్ తదితరులపై నమోదైన సెక్షన్లు బెయిలుకు వీల్లేనివి కావడంతో ఆయన్ను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.

# పల్లె పోరుకు వడివడిగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ జారీ చేయడంతోపాటు అవసరమైతే.. ఒక్కరోజు వ్యవధిలోనే నోటిఫికేషన్ కూడా ఇచ్చే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తోంది. డిసెంబర్ 15లోపు మొత్తం అన్ని దశల ఎన్నికలూ పూర్తి చేయాలనే ఆలోచనతో ఉంది. ఒకవేళ ప్రభుత్వం రెండు లేదా మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తే.. ఒక్కో దశ ఎన్నికకూ మధ్య కనీసం రెండు రోజులు సమయం ఉండేలా.. నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను పాత పద్ధతి ప్రకారం (50 శాతానికి లోబడి ఉండేలా) ఖరారు చేసి ఇవ్వాలని ఇటీవలే జరిగిన మంత్రివర్గ సమావేశంలో కోరిన మేరకు.. బూసాని వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ గురువారం తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. దీనికి మళ్లీ మంత్రివర్గ ఆమోదం అవసరం. అయితే మళ్లీ మంత్రివర్గ సమావేశం ఈ నెల 25న ఉంది. కానీ.. అప్పటిదాకా కూడా ఆగకుండా.. వెంటనే మంత్రులందరికీ ఆ నివేదికను పంపి సంతకాలు సేకరించి ఆమోదముద్ర తీసేసుకుంది. సాధ్యమైనంత త్వరగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశమే దీనికి కారణం. గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్ల బకాయిలు త్వరగా వచ్చేలా చేసేందుకే ప్రభుత్వం ఇలా వేగంగా అడుగులు వేస్తోందని అంటున్నారు. ఆర్థిక సంఘం కాలపరిమితి మార్చి వరకూ ఉన్నా.. ఇప్పుడు ఎన్నికలు పూర్తయి, కొత్త పాలకవర్గాలు కొలువుదీరి, కేంద్రానికి పెండింగ్ నిధుల విడుదల కోసం లేఖలు రాసి, అవి వచ్చేసరికి సమయం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే వీలైనంత తొందరగా ఎన్నికలకు వెళ్లనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకోసం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం శుక్ర, శనివారాల్లోనే రిజర్వేషన్ల విధివిధానాలపై మార్గదర్శకాలతో ఉత్తర్వులను జారీచేయనుంది. వాటి ఆధారంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ విభాగాలు జిల్లాల జనాభాకు, ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్లను ఖరారు చేయనున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయిన వెంటనే ఈ ప్రక్రియను రెండురోజుల్లోనే పూర్తిచేసేందుకు సంబంధిత విభాగాలు సమాయత్తమవుతున్నాయి. సర్కారు వేగానికి దీటుగా.. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ మొదలు పెట్టింది. అందులో భాగంగా ఇప్పటికే ఓటరు జాబితా సవరణపై దృష్టి పెట్టిన ఎస్ఈసీ.. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతోపాటు జిల్లాల వారీగా కలెక్టర్లు, డీపీవోలతో గురువారం వీడియోకాన్ఫరెన్సు (వీసీ) నిర్వహించింది. జిల్లాలవారీగా ఎన్నికల సంసిద్ధతను ఎస్ఈసీ రాణికుముదిని ఈ సందర్భంగా సమీక్షించారు. తుది ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, పోలింగ్ సామగ్రి, శాంతిభద్రతలు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, మోడల్ కోడ్ కమిటీ, ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాల రూపకల్పన వంటి అంశాలపై సమీక్షించారు.



## తెంగాణ మాదిరిగా దేశమంతటా

# సన్నబియ్యం ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌కు ప్రహ్లాద్ జోషి చెప్పారు. కాగా.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సహకారం అందించాలని కోరుతూ సీఎం రేవంత్ ఈ భేటీలో పలు అంశాలను ప్రస్తావించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించి రూ.1,468 కోట్ల సబ్సిడీని విడుదల చేయాలన్నారు. పీఎంజీకేఏవై అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేయాలని కోరారు. 2025-26 ఖరీఫ్‌లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులన్ని సానుకూలంగా పరిశీలిస్తామని ప్రహ్లాద్ జోషీ హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ వినియోగం తగ్గిందని, మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఎగుమతి అవకాశాలను పరిశీలించాలని సలహా ఇచ్చారు.



# తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల బంధం బలోపేతం

## 'తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్'లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 20:

'తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్' కార్యక్రమంతో తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక బంధం బలోపేతం కానున్నట్టు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన 'తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్' కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. శాస్త్రసాంకేతిక రంగాల్లో అనేక కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత్ ఫ్యూచర్ సిటీలో మొట్టమొదటి నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని నిర్మించేందుకు భూమి కేటాయిస్తామని ప్రకటించారు. పాదరక్షల వారసత్వంపై గచ్చిబౌలిలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)లో ఈనెల 28నుంచి 30 వరకు జాతీయ సదస్సు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, ఎఫ్‌డీడీఐ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఈ సదస్సుకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 28న ఉదయం 11గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ సదస్సును ప్రారంభించనున్నట్టు తెలిపారు.

# సోషల్ మీడియా చర్చలో ఎగ్‌ఫ్రీజింగ్



### ముందే దాచుకున్న అండాలతో ఎప్పుడైన గర్భం

### ఉపాసనా కామినేని పోస్ట్‌తో ఇప్పుడు సర్వత్రా ఆసక్తి

**హైదరాబాద్,నవంబర్20(నేటి ఫోకస్ న్యూస్):**

టాలీవుడ్ నటుడు రామ్ చరణ్ భార్య ఉపాసన కామినేని కొణిదల. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ ఈవెంట్‌లో ఎగ్ ఫ్రీజింగ్‌పై చేసిన వ్యాఖ్యలు వివాదం సృష్టించాయి. అలాగే ఇప్పుడు ఎగ్ ఫ్రీజ్‌పై చర్చలు మొదలయ్యాయి. దీనిపై సర్వత్రా ఆసక్తి కూడా కనిపిస్తోంది. ఇదో రకంగా మంచిదే. కొత్త అంశాలను నవదంపతులు తెలుసుకునే అవకాశం రావడంతో సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఇక వివరాల్లోకి వెళితే... ఈ వివాదం నేపథ్యంలో ఉపాసన మళ్లీ స్పందించారు. ఎక్స్ అకౌంట్‌లో తన వ్యాఖ్యలను సమర్థిస్తూ ఓ పోస్టు చేశారు. కెరీర్‌పై దృష్టి పెట్టే మహిళలు.. తమ ఎగ్స్‌ను

ఫ్రీజ్ చేసుకోవాలని, ఆ తర్వాత తము నచ్చిన సమయంలో గర్భాన్ని దాల్చాలని ఉపాసన సలహా ఇచ్చారు. ఆ సలహాపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. డాక్టర్లు, ఇన్‌ఫ్లూయన్సెర్లు, సోషల్ మీడియా యూజర్లు ఉపాసన వ్యాఖ్యలను తొలుత తప్పుపట్టారు. ఆ వ్యాఖ్యల పట్ల స్పష్టత కావాలని కొందరు ఆన్‌లైన్‌లో ఆమెను అడిగారు. ఈ నేపథ్యంలో ఉపాసన మళ్లీ ఎగ్ ఫ్రీజింగ్ గురించి స్పందించారు. అండాల సంరక్షణపై ఆరోగ్యకరమైన చర్చ జరుగుతున్నట్లు ఆమె చెప్పారు. తన వ్యాఖ్యలు ప్రజల్లో చర్చకు దారితీయడం సంతోషకరమని అన్నారు. ప్రజల స్పందన గౌరవిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎగ్ ఫ్రీజింగ్ వల్ల కలిగే లాభనష్టాల గురించి ఆమె వెల్లడించారు. తన వ్యక్తిగత అనుభవాలను ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. పెళ్లి, ఫలదీకరణ గురించి ఆమె తన పోస్టులో రాశారు. తనకు 27 ఏళ్ల వయసులో పెళ్లి జరిగిందని, తన ఇష్టపూర్వకంగా జరిగిందని, 29 ఏళ్ల వయసులో వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా తన అండాలను ఫ్రీజ్ చేయాలని నిర్ణయించుకున్నానని, 36 ఏళ్ల వయసులో తనకు తొలి సంతానం కలిగిందని, 39 ఏళ్ల వయసులో కవల పిల్లలకు జన్మనివ్వనున్నట్లు ఉపాసన తన పోస్టులో తెలిపారు. పెళ్లి, కెరీర్ మధ్య పోటీ సహజమే అని, కానీ నిండు జీవితంలో అవి రెండు ముఖ్యమే అని, అయితే నేను ఆ రెండింటికి టైం ఫిక్స్ చేసుకున్నానని, తన హక్కును తాను వినియోగించుకున్నట్లు ఉపాసన పేర్కొన్నారు. మర్యాద పూర్వకంగా స్పందిస్తున్న తన ఫాలోవర్లకు ఉపాసన థ్యాంక్స్ చెప్పింది. ఉద్యోగ సంస్థలు మహిళలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలన్న అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన కెరీర్ కౌన్సిలింగ్‌లో మాట్లాడుతూ.. మహిళలకు అతిపెద్ద బీమా తమ అండాలను ఫ్రీజ్ చేసుకోవడమే అని ఆమె అన్నారు. ఎందుకంటే ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, ఎప్పుడు పిల్లలను కనాలన్న అంశాలపై నిర్ణయం తీసుకోవడం సులువు అవుతుందన్నారు. ఆర్థికంగా బలోపేతం అయిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు

చేయవచ్చు అని ఆమె అన్నారు. ఎంత మంది పెళ్లి చేసుకోవాలని విద్యార్థులను ఉపాసన ప్రశ్న అడిగిన సమయంలో.. అమ్మాయిల కన్నా అబ్బాయిలే ఎక్కువ మంది చేతులు లేపారు. దీనిపై ఉపాసన స్పందిస్తూ.. ఇది ప్రగతిశీల భారత్‌కు నిదర్శనమన్నారు. ఉపాసన చేసిన ఆ సూచన వల్ల ఆన్‌లైన్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. తన సలహా జీవసంబంధమైన పరిమితులకు భిన్నంగా ఉన్నట్లు కొందరు విమర్శకులు పేర్కొన్నారు. ఫెర్టిలిటీ చికిత్స సులువైన అంశం కాదన్నారు. ఐవీఎఫ్, ఎగ్ ఫ్రీజింగ్ వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఓ ప్రముఖ గైనకాలజిస్ట్ స్పందిస్తూ .. బ్యాంకుల్లో కోట్లు ఉన్నవాళ్లు ఎగ్ ఫ్రీజింగ్ గురించి సలహా ఇవ్వడం సులువే అన్నారు. ఐవీఎఫ్ చికిత్సకు లక్షలు ఖర్చు అవుతోందన్నారు. ఎగ్ ఫ్రీజింగ్ కోసం ప్రతి ఏడాది లక్షల్లో ఖర్చు అవుతుందన్నారు. ఒక్క సిట్టింగ్ కూడా ఖర్చు చేయలేని మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఒకవేళ అండాలను ఫ్రీజ్ చేసినా.. అవి చివరకు విజయవంతంగా గర్భం దాల్చే అవకాశం ఉంటుందో లేదో చెప్పలేమని మరో గైనిక్ డాక్టర్ అన్నారు.



# కెటిఆర్‌పై అక్రమ కేసులు రేవంత్ లక్ష్యం

### రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శ

**హైదరాబాద్,నవంబర్20(నేటి ఫోకస్ న్యూస్):**

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట ఇది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గం. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం.స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.' అని ట్వీట్ చేశారు.

# ఆపరేషన్ సంభవ్ సక్సెస్

### ఇది ఇకముందూ కొనసాగుతుంది

### రంపచోడవరంలో ఎన్‌కౌంటర్ ప్రాంతంలో పర్యటన

### స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించిన డిజిపి

**రంపచోడవరం,నవంబర్ 20(నేటి ఫోకస్ న్యూస్):**

ఏపీలో ఆపరేషన్ సంభవ్ సక్సెస్ అయ్యిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో రంపచోడవరం చేరుకున్న డీజీపీ.. ఏవోబీ ప్రాంతంలో ఏరియల్ సర్వే చేశారు. ఆపై జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన రెండు వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఎకే 47 గన్స్, రైఫిల్, పేలుడుకు ఉపయోగించిన వస్తువులను పరిశీలించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్ కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. 50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది జూన్‌లో రంపచోడవరంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో లొంగిపోవాలని మావోయిస్టులను హెచ్చరించామని తెలిపారు. మావోయిస్టులు లేని ఏపీగా చేయాలనుకున్నామని వెల్లడించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందని డీజీపీ హరీష్ గుప్తా స్పష్టం చేశారు. ꠰ూగా.. రెండు రోజుల క్రితం అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో అగ్రనేతలు నేలరాలిన విషయం తెలిసిందే. మొదటి ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణితో పాటు.. నలుగురు మావోయిస్టులు మరణించారు. రెండో రోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడు మంది మావోలు హతమయ్యారు. వీరిలో కీలక నేతలు కూడా ఉన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో లభించిన డైరీ ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 50 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వారికి వైద్య పరీక్షల అనంతరం ఆయా జిల్లాల కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు వారికి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.



# సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

### వ్యక్తిగత హాజరు తో పూర్తయిన లాంఛనం

### జగన్ రాకతో అభిమానుల హల్‌చల్

**హైదరాబాద్,నవంబర్ 20(నేటి ఫోకస్ న్యూస్):**

అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

# కేటీఆర్‌కు బిగ్ షాక్



### ఫార్ములా -కారు రేసు కేసు విచారణకు గవర్నర్ అనుమతి

**హైదరాబాద్,నవంబర్20(నేటి ఫోకస్ న్యూస్):**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ భరించింది.

# దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

### కేంద్రమంత్రికి సిఎం రేవంత్ సూచన

### పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి

**హైదరాబాద్,నవంబర్20(నేటి ఫోకస్ న్యూస్):**



దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కెటిఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు

### స్థానిక ఎన్నికల ముందు ప్రభుత్వం కుట్ర

### మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు వేముల, వినోద్

**హైదరాబాద్,నవంబర్20(నేటి ఫోకస్ న్యూస్):**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీని కట్టడి చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్‌లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్, బీజేపీలు కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లామైంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినపుడు, ఎన్నికలు వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరుతొ కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయారు. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్షపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపింది. అందులో భాగంగానే విచారణ పేరిట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. ఫార్ములా ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచి తెలంగాణ రాష్టాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిందు కేటీఆర్. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులను కట్టడి చేయగలం అనుకోవడం పొరపాటే. మీరెన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటాం. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.



న్యాయస్థానాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది.. మీరు చేసే కుట్రలను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం అని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరికాదు అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. సమాజంలో ప్రజల అంశాలపై ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేయడం రాజ్యాంగ విరుద్ధం అని మండిపడ్డారు. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్ అని విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి అని వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. సీఎం రేవంత్ రెడ్డి కుట్రలను న్యాయపరంగా ఎదుర్కొంటాం అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.




# ఎఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం

**ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్**

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్కులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.

మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.








# అమీర్‌పేటలో అర్ధనగ్నంగా తిరుగుతా

**రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు**

అఖిల్ రాజ్, తేజస్వి రావు జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' నవంబర్ 21న శుక్రవరాం రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఈటీవీ విన్ ఒరిజినల్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాకు సాయిలు కంపాటి స్టోరీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం స్వయంగా నిర్వహించారు. ఇప్పటికే విడుదలైన ప్రతి అప్‌డేట్ మంచి అంచనాలు తీసుకొచ్చింది. అయితే తాజాగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాయిలు చేసిన కామెంట్స్ మాత్రం టాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారాయి. మా సినిమా చిన్నదైనా, దాని వెనక ఉన్న ఎమోషన్ చాలా పెద్దది. పల్లెటూరి కథలు, అమాయకమైన ప్రేమ, ఊర్లో జరిగే నిజ జీవిత సంఘటనలు నాకు తెలుసు. నేను విమానం నుంచి దిగి వచ్చే హీరోల కథలు రాయలేదు. మన దగ్గర జరిగిన నిజమైన కథను తీసుకొచ్చా. ఈ సినిమా 15 ఏళ్ల పాటు నరకం చూసిన ఒక జంట నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకున్నదని దర్శకుడు చెప్పారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయెుద్దు, సినిమా నచ్చకపోతే వదిలేయండని అభిమానులకు కోరుతూ.. మా టీమ్ ఎంత కష్టపడిందో మీకు సినిమా చూస్తే అర్థమవుతుంది. మన కష్టానికి తగిన ఫలితం తప్పకుండా వస్తుందని అంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయెుద్దని కోరుతూ.. 'ఈ సినిమాకు నెగెటివ్ టాక్ వస్తే అమీర్‌పేట్ సెంటర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతా!' అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సినిమా టీమ్ కష్టాన్ని నమ్మి ఇలాంటి ఛాలెంజ్ చేస్తున్నానని చెప్పారు. సాయిలు కంపాటి స్టేట్‌మెంట్ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి సినిమాపైనే పడింది.







# నేడు థియేటర్లలోకి అల్లరి నరేశ్ 12ఎ రైల్వే కాలనీ

టాలీవుడ్ యాక్టర్ అల్లరి నరేశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న థ్రిల్లర్ ప్రాజెక్ట్ '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో డాక్టర్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రం 21న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అల్లరి నరేశ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.కాగా ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఇంకా థియేటర్లలోకి రాకముందే ఓటీటీ పార్ట్‌నర్‌ను ఫిక్స్ చేసుకుంది. ఈ

మూవీ ఓటీటీ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో భారీ మొత్తానికి దక్కించు కున్నట్టు టాలీవుడ్ సర్కిల్ సమాచారం. థియాట్రికల్ రన్ తర్వాత మేకర్స్ ఓటీటీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వనున్నారు.12ఎ రైల్వే కాలనీలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీకి 'పొలిమేర', 'పొలిమేర 2' ఫేం డాక్టర్ అనిల్‌విశ్వనాథ్ కథ, స్కీన్‌ప్లే, సంభాషణలు సమకూరుస్తున్నారు. క్కువగా కామెడీ సినిమాలెందుకు చేయడం లేదని ప్రమోషన్స్‌లో అల్లరి నరేశ్‌ను ప్రశ్నించగా .. దీనికి అల్లరి నరేశ్ స్పందిస్తూ.. కామెడీ సినిమాలు తీయాలంటే ఇప్పుడు చాలా కష్టతరమైన పరిస్థితులు ఉన్నాయి. మేం ఒకవేళ ఇప్పుడు కితకితలు చేస్తే.. బాడీ షేమింగ్‌తో సినిమాను పక్కన పెట్టేస్తారు. ఇప్పుడు కొన్ని విషయాలు చాలా సున్నితంగా మారాయి. కొంతమంది మనోభావాలు దెబ్బతినే అవకాశముంది. ఈ రోజుల్లో మనం కలర్, బరువుతోపాటు ఇతర సున్నిత అంశాలపై మాట్లాడకూడదన్నాడు. ప్రేక్షకుల అభిరుచి ప్రతీ పది సంవత్సరాల కోసారి మారుతూ వస్తుంది. నేను గతంలో రైమింగ్ డైలాగ్స్, కౌంటర్స్‌తో సాగేకామెడీ సినిమాలు చేసేవాడిని. సుడిగాడు స్పూఫ్ సినిమా.ప్రేక్షకులు కూడా ప్రతీ కంటెంట్‌పై స్పూఫ్స్ చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జోకులు ఖచ్చితంగా ఆర్గానిక్‌గా ఉండాలి. వాటిని సోషల్ మీడియా మీమ్స్‌ను నుంచి అస్సలు కాపీ చేయెుద్దు. జనాలు ఇప్పుడు ఆర్గానిక్‌గా ఉండే సెన్సిబుల్ కామెడీని ఆశిస్తున్నారని చెప్పుకొచ్చాడు అల్లరి నరేశ్.

# చిరాకు పుట్టిస్తున్న ప్రీరిలీజ్ ఈవెంట్లు

**అవసరానికి మించి పొగడ్తలు అవసరమా**

**నటుడు, దర్శకుడు రవిబాబు**

తనకు సినిమాలు మార్కెటింగ్ చేసుకోవడం రాదని నటుడు, దర్శకుడు రవిబాబు తెలిపారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లు చిరాకు తెప్పిస్తాయన్నారు. అలాంటి ఈవెంట్‌లు పెట్టి నటీనటులను అవసరానికి మించి పొగుడుతూనే ఉంటారని అలా ఎందుకు చేస్తారో ఇప్పటికీ తనకు అర్థం కాదన్నారు. అందుకే తాను ఈవెంట్‌లకు రానని చెప్పారు.కొన్ని సినిమాల్లో నన్ను విలన్‌గా చూసినవారు ఇప్పటికీ నేను ఎదురుగా కనిపిస్తే భయంతో వెళ్లిపోతున్నారు. సినిమాలు ప్రేక్షకులపై అంతగా ప్రభావం చూపుతాయి. అందుకే సున్నితమైన అంశాలను తెరకెక్కించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలని రవిబాబు చెప్పారు.



తనకు మార్కెటింగ్ చేసుకోవడం తెలియదని దర్శకుడు రవిబాబు అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హాస్యం కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుందన్నారు. అందుకే తాను ఎక్కువగా విజువల్స్‌కు ప్రాధాన్యం ఉండేలా చూస్తానన్నారు.

'అవును సినిమాలో ఆ హీరోయిన్ పెద్ద ఇబ్బందుల్లో పడుతుంది. దాన్ని విజువల్‌గా ఎలా చూపించాలి అని ఆలోచించి.. ఏనుగు పెద్ద జంతువు కాబట్టి ఏనుగంత ప్రాబ్లమ్‌లో హీరోయిన్ ఉంది అని చెప్పడం కోసం పోస్టర్ చేయించా. ఆ పోస్టర్ చూసి ఒక వ్యక్తి నాకు ఫోన్ చేసి తిట్టాడు. ఏనుగు ఉందని పిల్లల్ని తీసుకొని సినిమాకు వెళ్తే సినిమాలో ఏనుగు లేదన్నాడు. ఆయనకు సారీ చెప్పి పెట్టేశాను. ఈ సినిమా చూసి మరో మహిళ ఫోన్ చేశారు. శరీరం లేని వ్యక్తి, కళ్లకు కనిపించని వ్యక్తి హీరోయిన్‌ను ఎలా కలవాలని అనుకుంటాడు అని నాతో వాదించారు. ఆమెకు నేను ఆ సినిమా కథే అది అని వివరించలేకపోయాను'. 'ప్రేక్షకులు మనం తీసే సినిమాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి.